క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ రాఘవేంద్రనగర్, 11కేవీ ఆంధ్ర కేసరినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

బొడ్రాయికి జలాభిషేకం



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న బాచుపల్లి గ్రామస్తులు

కందుకూరు: వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ మండల పరిధిలోని బాచుపల్లిలో మహిళలు సోమవారం దేవాలయాల్లో విగ్రహాలకు, బొడ్రాయికి జలాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పరిధిలోని పొలాల్లో ఇప్పటికే విత్తనాలు నాటగా మొలకెత్తి వర్షం లేక చనిపోతున్నాయి. దీంతో దేవుళ్లకు బిందెలతో నీళ్లు తెచ్చి అభిషేకాలు చేసి త్వరగా వానలు కురువాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యాలాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ కె.ప్రేమలతబాల్‌రెడ్డి, మహిళలు బాలమ్మ, ఎ.ఇందిరమ్మ, పుష్పమ్మ, శకుంతల, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

కందుకూరు: తమ సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె సోమవారంకు 5వ రోజుకు చేరింది. తమ పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, కారోబార్లు బాల్‌రాజ్‌గౌడ్, మధు, మహేందర్, నర్సింహ, యాదయ్య, దశరథ, శంకర్, శ్రీధర్, శ్రీధర్‌రెడ్డి, పి.మహేందర్, మల్లయ్య, భిక్షపతి, బుగ్గయ్య, జంగయ్య, లక్ష్మయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మీర్‌పేట కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి



సబితారెడ్డి చేతులమీదుగా నియామకపత్రం అందుకుంటున్న చంద్రశేఖర్‌రెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యదర్శిగా నందిహిల్స్‌కు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి ప్రశాంతిహిల్స్‌లో జరిగిన సభలో మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా చంద్రశేఖర్‌రెడ్డి నియామకపత్రం అందుకున్నారు. కార్పొరేషన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని.. తనపై నమ్మకంతో పదవికి ఎంపిక చేసిని మంత్రి సబితారెడ్డి, పార్టీ పెద్దలకు చంద్రశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చెత్తను తొలగించరూ..



బడంగ్‌పేటకు వెళ్లే రోడ్డు పక్కన చెత్త

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని రైతుబజార్ నుంచి బడంగ్‌పేటకు వెళ్లే ప్రధాన రహదారిపై చెత్తను డంప్ చేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిపై పెద్దఎత్తున చెత్త పేరుకుపోతున్నా ఎప్పటికప్పుడు తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే చెత్తను తొలగించి శుభ్రం చేయాలని లేకపోతే డంపింగ్‌కు అడ్డాగా మారుతుందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు ఇలా..
రూ. టమాట 65, వంకాయ 28, బెండ 40, పచ్చి మిర్చి 90, కాకర 45, బీర 28, క్యాబేజి 13, ఫ్రెంచి బీన్స్ 55–90, క్యారెట్ 45, దొండ 18–28, చిక్కుడు 65, గోకర 33, బీట్‌రూట్ 25, క్యాప్సికం 67, ఆలు 20, దోస 25, సార 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 28. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

సాగువేళ.. అందిన సాయం



మహేశ్వరంలో సాగు పనిలో రైతు

- నియోజకవర్గంలో 90శాతం రైతుల ఖాతాల్లో రైతుబంధు జమ
- మిగితావారికి త్వరలో జమ చేస్తామంటున్న అధికారులు
- మరో రెండు–మూడు వానల కోసం రైతన్నల ఎదురుచూపు

మహేశ్వరం: వానాకాలం ప్రారంభమైంది. గ్రామాల్లో ఇప్పటికే కొంతమంది రైతులు విత్తనాలు విత్తుకోగా మరికొంతమంది మరో రెండు మూడు భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. వరి పండించే రైతులు నారుమళ్లు పోసుకోగా మరికొంత మంది నాట్లు వేసే పనిలో ఉన్నారు. ఈ సమయంలో తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు డబ్బులను వారి ఖాతాల్లో జమచేస్తోంది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మండలాల్లో రైతుబంధుకు ఈ యేడాది 35,096 మంది రైతులను వ్యవసాయాధికారులు అర్హులుగా గుర్తించారు. వారిలో ఇప్పటివరకు 32,577 మంది రైతుల వారి ఖాతాల్లో రూ.28,77,17,886 కోట్లు జమ అయ్యాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మిగతా రైతులకు త్వరలో రైతుబంధు డబ్బులు జమకానున్నాయి. డబ్బులు ఖాతాలో పడని రైతులు ఆందోళన చెందవద్దని అందరి అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయని అధికారులు పేర్కొన్నారు.

32,577 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ



నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మండలాల్లోని 35,096 మంది రైతుల వివరాలు ట్రెజరీకి పంపించాం. ఇప్పటివరకు 32,577 మంది రైతులకు ఎకరానికి రూ.5వేల చొప్పున మొత్తం రూ.28,77,17,886 జమా అయ్యాయి. మిగతా రైతులకు త్వరలో డబ్బులు జమా అవుతాయి. రైతులెవరూ ఆందోళన చెందొద్దు. ప్రస్తుతానికి గుంట నుంచి 5 ఎకరాల లోపు భూమి కలిగిఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమాఅయ్యాయి.

– సుజాత, ఏడీఏ, మహేశ్వరం

సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి



సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ సర్కార్ రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోంది. పట్టా పాసుబుక్ కలిగిన ప్రతి రైతుకు ఎకరానికి రైతుబంధు సాయం రూ.5వేల చొప్పున రెండు పంటలకు ఏడాదికి రూ.10 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నారు. రైతుబంధు కింద వచ్చిన డబ్బులు పంటల సాగుకు ఉపయోగించుకోవాలి. మిగతా రైతులకు త్వరలో రైతుబంధు డబ్బులు జమా అవుతాయి.

– సబితారెడ్డి, విద్యాశాఖ మంత్రి

నియోజకవర్గంలో రైతుబంధు వివరాల పట్టిక

క్రస	మండలం	లబ్ధిదారులు	లబ్ధిపొందిన రైతుల సంఖ్య	జమ కావాల్సిన డబ్బులు	జమ అయిన డబ్బులు
1	మహేశ్వరం	14,040	12,408	రూ.14,60,81078	రూ.9,0880051
2	కందుకూరు	19,227	18,477	రూ.24,0390000	రూ.18,4400000
3	బాలాపూర్	1,829	1,692	రూ.1,6513389	రూ.1,24,37835
	మొత్తం	35,096	32,577	రూ.40,29,84467	రూ.28,77,17,886

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

కార్పొరేటర్ శ్రీవాణి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అధికారులను ఆదేశించారు. సోమవారం డివిజన్ పరిధి డాక్టర్స్ కాలనీలో.. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, జలమండలి మేనేజర్ పవిత్ర, శానిటేషన్ సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ సమస్యను తొందరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పైపులైన్ ఆధునీకరణకు ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల అంజన్, మహిళా కార్యదర్శి టి.సరిత, నాయకులు.. దయాకర్, సూర్యనారాయణ, చంద్రయ్య, శ్రీనివాస్, రామచంద్రయ్య, జలమండలి సూపర్‌వైజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లాలబావిని కాపాడండి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని తొర్రూర్ రోడ్డులో ఉన్న నల్లాలబావి, మోటార్‌ను.. స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు సోమవారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీకి ఫిర్యాదు చేశారు. స్థానికుల నుంచి ఫిర్యాదు అందుకున్న కమిషనర్ నల్లాల బావిని పరిశీలించారు. ఎన్నో ఎళ్ల నుంచి గ్రామ పంచాయతీ ఆధీనంలోనే ఉన్న ఈ బావిని గ్రామస్తులు వినియోగించే వారని.. మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ భూమిలో కొందరు అక్రమంగా నిర్మాణాలు కూడా చేపట్టారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు స్పందించి నిర్మాణాలను తొలగించడంతో పాటు భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

వైభవంగా తొట్టెల ఊరేగింపు



కార్తీక్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీరాంకాలనీవాసులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీలో సోమవారం తొట్టెల ఊరేగింపు వైభవంగా కొనసాగింది. ఆదివారం రాత్రి శ్రీరామ యువ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలహారపు బండి ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీఆర్‌ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమరేందర్ రెడ్డి, మనోహర్‌రెడ్డిలు పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, శంకర్, ప్రశాంతి, నాయకులు సుధాకర్‌గౌడ్, జనార్దన్, అర్జున్, కపిల్‌గౌడ్, రవికుమార్ పాల్గొన్నారు.

అమ్మవారి ఊరేగింపు..



పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: ఆషాఢమాసంను పురస్కరించుకోని తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో యంగ్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం మహంకాళి అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు, కానుకులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూత్ అధ్యక్షుడు బరిగెల రాకేష్‌గౌడ్, కౌన్సిలర్ బరిగెల హేమలత రాజుగౌడ్, యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోండి

హుడాకాంప్లెక్స్: విద్యార్థిదశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని త్రివేణి విద్యా సంస్థల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం సరూర్‌నగర్ త్రివేణి పాఠశాలలో నూతన విద్యార్థి పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ గౌరవ వందనంతో కార్యక్రమం ప్రారంభించారు. పాఠశాల హెడ్‌బాయ్‌గా యశస్వీధర్, హెడ్‌గర్ల్‌గా ప్రియ ఎన్నికై ప్రమాణస్వీకారం చేశారు. స్పోర్ట్స్ కెప్టెన్, వైస్ కెప్టెన్లుగా బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించి గౌరవ సూచికంగా బ్యాడ్జీలు అందజేసి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీల్, హెడ్ మిస్ట్రెస్ యోగేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టండి

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణారెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో వాటర్, డ్రైనేజీ లీకేజీలు లేకుండా చేయాలని కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్‌టీఆర్‌నగర్, వాసవికాలనీ, యాదవనగర్ తదితర కాలనీల్లో కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీల్లో తాగునీటి లైన్‌లలో లీకేజీలు కాకుండా చూడాలని వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. కాలనీలో పలుచోట్ల తాగునీరు వృథాగా పోవడాన్ని ఆమె పరిశీలించారు. కాలనీలో ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. లీకేజీ సమస్య తీవ్రంగా ఉన్న చోట్ల నూతన పైప్‌లైన్‌లకు ప్రణాళికలు రూపొందించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు.

నేత్రదానంపై అపోహలు వీడండి

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్

ఆమనగల్లు: నేత్రదానంపై అపోహలు వీడి.. ప్రతిఒక్కరూ నేత్రదానం చేసి మరో ఇద్దరికి చూపు ప్రసాదించాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో కంటి వైద్యులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 66 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 34 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. కంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు జూలురి రమేష్, నటరాజ్ యాదయ్య, లయన్స్ క్లబ్ కోశాధికారి వెంకటయ్య, పీఆర్‌ఓ పాషా, సభ్యులు రాములు, సుధీర్ రెడ్డి, రాంరెడ్డి, వీరబొమ్మ రామ్మోహన్, కొత్త మల్లేశ్, ఎంగలి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



నాగార్జునను సన్మానిస్తున్న ఉపేందర్‌రెడ్డి, గణేష్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగార్జునను రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత సోమవారం కలిసి సత్కరించారు. యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీంద్ర, రమేష్ నేత, బొడ్డుపల్లి మహేందర్, పగడాల శ్రీశైలం, కల్యాణ్ యాదవ్, ప్రేమ్ నాయక్, సలీం, పాండు, అనుదీప్ పాల్గొన్నారు

అధికారులు స్పందించడంలేదని..

చందాలు వేసుకొని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీలోని 9వ వార్డు పరిధిలో ఉన్న వెంకటగిరి కాలనీవాసులు చందాలు పోగుచేసి రూ.2 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. వెంకటగిరి కాలనీలో మురుగు కాలువ లేక ఇబ్బందులు పడుతున్నామని.. మురుగు కాలువ నిర్మించాలని గతంలో మున్సిపల్ చైర్మన్, పాలకవర్గానికి, కమిషనర్‌కు కాలనీవాసులు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. వారు పట్టించుకోకపోవడంతో కాలనీవాసులే చందాలు వేసుకొని సోమవారం కాలనీలో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కొండారెడ్డి, యాదయ్య, నాగరాజు, కుమార్, సైదులుగౌడ్, వెంకటయ్య, రాజు, శ్రీను, యాదయ్య, లక్ష్మణ్‌నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌దే విజయం



మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన నాయకులు

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం బీఆర్‌ఎస్ సీనియర్ నేత కొరుపోలు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మహేశ్వరం గడ్డపైన ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయని దీమా వ్యక్తం చేశారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, రైతుబంధు, రైతుబీమా, డబుల్ బెడ్‌రూమ్స్ పంపిణీ, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణతో పాటు పలు సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీని మూడోసారి గెలిపిస్తాయని ఆమె పేర్కొన్నారు. త్వరలో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుండి భారీఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరికలు ఉంటాయన్నారు. బీజేపీ నుండి బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో రామ్‌దాస్ యాదవ్, అయిల్ల రాజేందర్ గౌడ్, వినోద్, జనార్దన్ తదితరులు ఉన్నారు. ఘట్టుపల్లి సర్పంచ్ అనిత, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, వార్డు సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, రేణుకా పరుశారామ్, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంకరయ్య, కోఆప్షన్ సభ్యులు శేఖర్ యాదవ్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ సాదత్, నాయకులు నర్సింహ, తోట నర్సింహ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని పెద్దమ్మతండాకు చెందిన శిరీష, మాదాపూర్‌కు చెందిన సత్యమ్మ, పులిమామిడికి చెందిన మంజులకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60 వేల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఆయా చెక్కులను మండల కేంద్రంలో లబ్ధిదారులకు సోమవారం వారు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మంద సాయిలు, సుమన్‌నాయక్, బీఆర్‌ఎస్ నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు లచ్చానాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పాండుగౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దామోదర్‌గౌడ్, యూత్ నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, విఘ్నేశ్వర్‌రెడ్డి, బొక్క దీక్షిత్‌రెడ్డి, బర్కం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు

కందుకూరు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం కందుకూరు ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా బాల్‌రాజు మాట్లాడారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.2 వేలు వేతనం పెంచుతున్నట్లు ప్రకటించినా ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. మరోపక్క ఆరు నెలలుగా మెస్ బిల్లులు చెల్లించడంలేదన్నారు. దీంతో అప్పులు చేసి మరీ పిల్లలకు భోజనం పెడుతున్నా వారిని పట్టించుకోవడం లేదన్నారు. వంట షెడ్లు నిర్మించడంతోపాటు ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులపై ఇచ్చే నగదు మొత్తాన్ని పెంచాలని, వేతనం నెలకు రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సంఘం మండల అధ్యక్షురాలు లక్ష్మీబాయి, ఉపాధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి కిషన్‌జీ, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, అమృత, శంకరమ్మ, భాగ్యలక్ష్మి, ఆండాలు, హైమావతి, లక్ష్మమ్మ, శైలజ పాల్గొన్నారు.

నూతన నియామకం



నియామకపత్రం అందుకుంటున్న అంజయ్య

కందుకూరు: తెలంగాణ వినియోగదారుల ఫోరం మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్‌గా కందుకూరుకు చెందిన తాళ్ల అంజయ్య నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్ నగరంలోని మూసారాంబాగ్‌లో తెలంగాణ వినియోగదారుల జిల్లా సమావేశం ఆ ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొత్వాల్ దయానంద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆ ఫోరం జాతీయ కన్వీనర్ సింపుల్ రాథోడ్, రాష్ట్ర అధ్యక్షుడు అంబు రాథోడ్, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ చేతులమీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు ఫోరం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. వినియోగదారుల హక్కులు, చట్టాలను గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తానన్నారు.

పంచాయతీ సిబ్బందికి వాకీటాకీల అందజేత



సిబ్బందికి వాకీటాకీలు అందజేసిన సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: గ్రామ పంచాయతీలో అందించే సేవల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కడ్తాల్ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన పాలకమండలి సభ్యులు సమావేశమై.. గ్రామంలోని సమస్యలపై చర్చించారు. పంచాయతీ పరిధిలో పనిచేసే సిబ్బందికి «వాకీటాకీ»లను అందించనున్నట్లు తెలిపారు. వాటి సహాయంతో గ్రామంలో ఎక్కడ సమస్య ఉన్న సిబ్బందికి వాకీటాకీల ద్వారా సమాచారం వెంటనే వెళ్తుందని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు భిక్షపతి, మహేశ్, నరేందర్‌రెడ్డి, మల్లయ్య ఉన్నారు.

దేవుని పడకల్‌లో కప్ప పండుగ



వేడుకల్లో గ్రామస్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌లో సోమవారం గ్రామస్తులు కప్ప పండుగ నిర్వహించారు. కప్పను వేపాకు మండల మధ్య కట్టి బోనాలతో గ్రామ ప్రధాన కూడళ్ల మీదుగా ఊరేగింపు జరిపారు. వరుణదేవుడా కరుణించవా అంటూ మహిళల పాటలు పాడుతూ వేడుకున్నారు. వర్షాకాలం వచ్చి రెండు నెలలు అవుతున్నా ఇప్పటికీ సరైన వర్షాలు పడలేదన్నారు. నాటిన విత్తనాలు మొలకెత్తక భూమిలోనే కూరుకుపోయాయి. అంతేగాక ప్రస్తుతం ఉన్న పంటలకు సరిపోను నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, పశువులకు గ్రాసం కరువైందని, తాగునీరు దొరుకక మూగజీవాలు అల్లాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు కురవాలని వేడుకున్నారు.